# కుడియడమైతే

ప్రభుత్వోద్యోగులలో కుటుంబ నియంత్రణ పాటించే వారికి ప్రో త్సాహం ఇచ్చే పథకంలో భాగంగా, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునే వుద్యోగులకు, బహుమతిగా ఇంక్రిమెంట్లు ఇచ్చేట్లు ప్రభు త్వం నిర్ణయించింది. 1976లో మొదటిసారిగా, ప్రభుత్వ ఉత్తర్వులో, ఇద్దరు పిల్లలు వున్నవాళ్ళు ఆపరేషన్ చేయించుకుంటే రెండు ఇంక్రిమెంట్లు ముగ్గురి తరవాత అయితే ఒక ఇంక్రిమెంటు ఇచ్చేట్లుగా ఆదేశించారు.

అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా గత ప్రభుత్వ నిర్ణయాలు రద్దు చెయ్యడమో, లేదా సవరణలు చేయ్యడమో జరుగుతూంటుంది. అలానే 1976కు ముందు, స్వచ్ఛందంగా ఆపరేషన్ చేయించుకున్న వారికి కూడా ఇంక్రిమెంట్లు ఇవ్వవలసినదిగా ఆదేశించారు.

దీనితో ప్రభుత్వ కార్యాలయాలలో ఇంక్రిమెంట్లు శాంక్షన్ చేయిం చుకునే హడావిడి మొదలైంది. గతంలో ఆపరేషన్ చేయించుకున్న హాస్పటల్స్‌కి వెళ్ళి సర్టిఫికేట్స్ తెచ్చుకోవడం మొదలు పెట్టారు.

సిబ్బంది గుమాస్తా మూర్తి తలవంచుకుని సర్వీసు బుక్స్ ముందు వేసుకుని, చుట్టూ ఫైల్స్‌తో తలమునకలై కూర్చుని వున్నాడు.

"నమస్తేసార్" తలవంచుకునే వచ్చిన వ్యక్తిని చూడకుండా, "నమస్తే" అన్నాడు మూర్తి.

"నమస్తే ఇ. సీ. గారూ (ఎస్టాబ్లిష్‌మెంట్ క్లర్క్..)"

తల ఎత్తిచూశాడు. తమ ఆఫీసులో కుటుంబరావు. "ఓహో మీరా రండి—కూర్చొండి."

"నా ఇంక్రిమెంట్లసంగతి ఏం చేశారు?"

"మీ ఇంక్రిమెంట్లు కాదు కాని, నా కొంప మునిగింది.

"ఏమయింది ?"

ఈ లోగా అటెండర్ వచ్చి "కుటుంబరావుగారూ అయ్యగారు పిలు స్తున్నారు" అన్నాడు.

బలి బసువులా ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు కుటుంబరావు.

గుడ్ మార్నింగ్ సార్."

"యస్" ఆయన వ్యవహారం చూస్తే, చాలా కోపంగా వున్నట్లుంది

"మిస్టర్ కుటుంబరావ్. నువ్వేదో నిజాయితీ పరుడవనుకున్నా. రెండు ఇంక్రిమెంట్ల కోసం అబద్ధాలు ఎందుకు, ఈ సర్టిఫికెట్ చూడు. నిజానికి నిన్ను సస్పెండ్ చెయ్యాలి" అని కుటుంబరావు ముందుకు విసిరాడు ఒక కాగితం. ఆ కాగితం కుటుంబరావు గతంలో ఆపరేషన్ చేయించుకున్నందుకు ఇచ్చిన సర్టిఫికెట్. అందులో ఇలావుంది.

"శ్రీ కుటుంబరావు గారికి ట్యూబెక్టమీ ఆపరేషన్ ది——న చేయబడింది"

నిర్ఘాంతపోయాడు కుటుంబరావ్.

ట్యూబెక్టమియా !

సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్ని కసిదీరా తిట్టుకున్నాడు మనసులోనే.

"వెరీ సారీ సర్. ఎక్కడో పొరబాటు జరిగింది" అంటూ బయట పడ్డాడు కుంటి కుటుంబరావుగారు.

(మగవారికి చేసే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ని వేసక్టమీ అని, స్త్రీలకు చేసేదాన్ని ట్యూబెక్టమీ అని అంటారు.).

....o....

# ఆమె నవ్వింది

రాత్రి పదకొండయింది. హైదరాబాదు నగరాన్ని ఎన్నో బస్సులతోపాటు ఒక సెమిలగ్జరీ బస్ వదిలిపెడుతూంది.

సెమిలగ్జరీలో రెండవ లైనులో చివర ఒక యువకుడు, అతనికి ప్రక్కనే ఆ చివర ఒక అమ్మాయి కూర్చుని వున్నారు

అమ్మాయి తెల్లని బట్టలలో "వెన్నెలకన్య"లా వుంది. సెమిలగ్జరీ కుషన్లో వొదిగిపోయిన ఆమె వొంపుసొంపులు ప్రక్కనే కొంచం యడంగావున్న అబ్బాయికి మత్తెక్కిస్తున్నాయి.

ఆ అమ్మాయి నాగార్జునసాగర్కి టికెట్ తీసుకుంది.

"మీరు సాగర్ ఎందుకు వెళుతున్నారు?" అన్నాడా అబ్బాయి.

ఆ అమ్మాయి మాట్లాడలేదు.